క్లుప్తంగా

నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం

ముత్తుకూరు: మండలంలోని రెండు పంచాయతీలకు సంబంధించి రెండు వార్డుల్లో జరిగే ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ మొదలైంది. ఇందులో భాగంగా దువ్వూరువారిపాళెం ఆరో వార్డుకు బుధవారం ఒక నామినేషన్ దాఖలైంది. పోలంరాజుగుంట పంచాయతీలోని ఒకటో వార్డుకు నామినేషన్లు రాలేదు. గురువారం చివరిరోజని ఈఓపీఆర్డీ హేమంత్ తెలిపారు.

ఇరుకళల పరమేశ్వరి హుండీ కానుకల లెక్కింపు



నెల్లూరు(బృందావనం): నగరంలోని ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో హుండీ కానుకల లెక్కింపును బుధవారం నిర్వహించారు. ఏప్రిల్ 26 నుంచి ఈనెల 9వ తేదీ వరకు భక్తులు అమ్మవారి హుండీల్లో సమర్పించిన కానుకలను లెక్కించగా రూ.8,43,368ల రాబడి వచ్చిందని ఆలయ ఈఓ మల్లికార్జునరెడ్డి తెలిపారు. హుండీ లెక్కింపును ఆలయ చైర్మన్ ఆర్ శ్రీనివాసరావు, అల్లూరు పోలేరమ్మ ఆలయ ఈఓ చిట్టిబాబు, దేవాదాయ శాఖ నెల్లూరు ఇన్‌స్పెక్టర్ సుధీర్ పర్యవేక్షించారు.

చెత్త సేకరణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- కమిషనర్ వికాస్ మర్మత్



సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్

నెల్లూరు సిటీ: ఇంటింటి చెత్త సేకరణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కార్పొరేషన్ కమిషనర్ వికాస్ మర్మత్ హెచ్చరించారు. కార్పొరేషన్ పరిధిలోని 21వ డివిజన్, మాగుంటలేవుట్ ప్రాంతంలో బుధవారం కమిషనర్ పర్యటించారు. పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. వీధుల్లో వ్యర్థాలు పేరుకుపోయి ఉండడం, ఇంటింటి చెత్త సేకరణలో నిర్లక్ష్యంగా ఉండడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. శానిటరీ కార్యదర్శుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పారిశుధ్య సిబ్బంది విధులకు అనుమతి లేకుండా గైర్హాజరైతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భవన నిర్మాణాలకు సంబంధించి ఇసుక, కంకర, ఇతర మెటీరియల్‌ను రోడ్లపై నిల్వ చేయడం గమనించి భవన యజమానులకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. ఖాళీ ప్లాట్లలో నీరు చేరి దోమలు వ్యాప్తి చెందకుండా యజమానులకు నోటీసులు జారీ చేయాలని సూచించారు. పారిశుధ్యానికి నగర ప్రజలు సహకరించాలని కోరారు. ఇళ్ల వద్దకు వాహనాలు వచ్చినప్పుడే చెత్తను అందజేయాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్తపడేస్తే ఉపేక్షించమని హెచ్చరించారు. కమిషనర్ వెంట ఎంహెచ్‌ఓ పి.వెంకటరమణ, శానిటరీ విభాగ ఉద్యోగులు పాల్గొన్నారు.

వక్తృత్వ, వ్యాసరచన పోటీలు

నెల్లూరు (టౌన్): హిరోషిమా, నాగసాకి డేను పురస్కరించుకుని ఏసీనగర్‌లోని మల్లెల సంజీవయ్య మున్సిపల్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు ప్రపంచ శాంతి – భావి భారత పౌరుల ఆకాంక్ష అనే అంశంపై వక్తృత్వ, చిత్రలేఖన, వ్యాసరచన పోటీలను బుధవారం నిర్వహించారు. శాస్త్ర సాంకేతిక మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులతోపాటు ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం శాంతి ర్యాలీ నిర్వహించారు. ఆ మండలి జిల్లా విషయ నిపుణులు ప్రసాద్ మాట్లాడారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం హైమావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణోత్సవం



నెల్లూరు(బృందావనం): ఆడికృతిక సందర్భంగా మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణోత్సవాన్ని బుధవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఉదయం వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామికి విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం దేవదేవేరులను నెమలి వాహనంపై కొలువుదీర్చి నగరోత్సవం నిర్వహించారు. రాత్రి వల్లీదేవసేన, సుబ్రహ్మణ్యస్వామిని విశేషంగా అలంకరించి శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించారు. ఆలయ ఈఓ, ధర్మకర్తల మండలి చైర్మన్, సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి చర్యలు

- విద్యార్థుల కోసం అనేక పథకాల అమలు
- కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి



బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి, చిత్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులు

కోవూరు: 'ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా మనబడి నాడు – నేడు పథకాన్ని ప్రవేశపెట్టారు.' అని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బుధవారం ఎమ్మెల్యే కోవూరులో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 78 సచివాలయాల పరిధిలో ఇప్పటి వరకు 92,340 గడపలు తిరిగినట్లు తెలిపారు. ఎక్కడికి వెళ్లినా ప్రజలు ఘన స్వాగతం పలికి ఆశీర్వదిస్తున్నారన్నారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థల ద్వారా సంక్షేమ పథకాలను లబ్ధిదారుల ఇంటికి చేరవేస్తున్న ఘనత మన ప్రభుత్వానిదేనన్నారు. దీనిని ప్రతిపక్షాలు జీర్ణించుకోలేక ఇష్టానుసారం మాట్లాడుతున్నాయని విమర్శించారు. ప్రజలకు మంచి జరగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లోనూ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు సీఎం ఎంతో కృషి చేస్తున్నారన్నారు. నేటి పోటీ ప్రపంచంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు రాణించేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. నాడు – నేడు కార్యక్రమం ద్వారా కార్పొరేట్ స్థాయి వసతులు కల్పించినట్లు తెలిపారు. విద్యార్థుల కోసం అమ్మఒడి, గోరుముద్ద, ఇంగ్లిష్ మీడియం చదువులను ప్రవేశపెట్టారన్నారు. సీఎం అమలు చేస్తున్న పథకాలను రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ స్వాగతిస్తున్నారన్నారు. అనంతరం కోవూరు గాంధీపార్కు వద్ద మహాత్ముని విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

ప్రత్యేక కార్యక్రమం

ప్రజల్లో దేశభక్తిని పెంపొందించడానికి నా భూమి – నా దేశం కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు ఎంపీడీఓ శ్రీహరి తెలిపారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా కోవూరు పంచాయతీ కార్యాలయంలో బుధవారం జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి హాజరయ్యారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన స్వాతంత్ర్య సమరయోధులు, రక్షణ రంగం, కేంద్ర సాయుధ దళాలు, పోలీసు శాఖలో పనిచేసి, పదవీ విరమణ చేసిన, ప్రాణాలర్పించిన వారికి చెందిన కుటుంబసభ్యులను ఘనంగా సన్మానించామన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డీఏఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, ఎంపీపీ పార్వతి, జెడ్పీటీసీ శ్రీలత, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సుబ్బారెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు నరసింహులురెడ్డి, ఎంఏఏబీ చైర్మన్ ప్రసాద్‌రెడ్డి, కోవూరు, గంగవరం సర్పంచ్‌లు విజయ, లక్ష్మీకుమారి, ఎంపీటీసీ సభ్యులు జ్యోత్స్న, వేణుగోపాల్, అనుబంధ సంఘాల నాయకులు అనూప్‌రెడ్డి, చిరంజీవి, వెంకటరమణారెడ్డి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

స్వల్పంగా పెరిగిన నిమ్మ ధరలు



యార్డులో నిమ్మకాయలు

పొదలకూరు: సాధారణంగా ఆగస్టు నెలలో నిమ్మకాయలు కొనుగోలు చేసేవారు తక్కువ. ధరలు కూడా కొంతకాలంగా అంతంతమాత్రంగానే ఉన్నాయి. అయితే రెండు రోజులుగా స్వల్పంగా ధరలు పెరిగాయి. ప్రస్తుతం మార్కెట్లో కిలో నిమ్మకాయలు రూ.25 నుంచి రూ.40 ధర పలుకుతున్నాయి. అయితే నాణ్యత కలిగిన కాయల ధర రూ.40 ఉన్నట్లు వ్యాపారులు వెల్లడించారు. ఈ ప్రాంత రైతులు నిమ్మ లేకుంటే జీవనం కూడా కష్టంగా మారేదంటున్నారు. ఇతర పంటలేవీ ఇక్కడ ఆశించిన స్థాయిలో దిగుబడి ఉండదు. రబీ సీజన్లో వరి సాగు చేసే రైతులు తర్వాత నిమ్మ, పత్తి, మినుము, పెసర పంటల సాగుపై ఆధారపడి జీవిస్తున్నారు. ఏప్రిల్, మే, జూన్ నెలల్లో కాయల దిగుబడి కూడా తోటల్లో ఆశించిన స్థాయిలో ఉన్న కారణంగా ఆర్థికంగా బలపడ్డారు. సకాలంలో వర్షాలు కురుస్తుండడంతో నిమ్మతోటలకు నీటి సౌకర్యం కోసం రైతులకు గణనీయంగా ఖర్చులు తగ్గిపోయాయి. ఫలితంగా నీటి యాజమాన్యం పద్ధతులు సులువు కావడంతోపాటు లేత తోటలకు ప్రభుత్వం సూక్ష్మసేద్యం కింద డ్రిప్, స్ప్రింక్లర్ల ఏర్పాటుకు రాయితీని పునరుద్ధరించడంతో రైతులు సంతోషంగా ఉన్నారు.

పీహెచ్‌సీలను సద్వినియోగం చేసుకోండి



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పూజిత

మనుబోలు: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని పీహెచ్‌సీ వైద్యురాలు గేయ పూజిత అన్నారు. ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో బాగంగా బుధవారం స్థానిక పీహెచ్‌సీలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి నెలా 9 లేదా 10 తేదీల్లో పీహెచ్‌సీలో గర్భిణులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. హైరిస్క్‌తో ఉన్న వారిని గుర్తించి ప్రత్యేక వైద్య సదుపాయాలు కల్పిస్తామన్నారు. మాతాశిశు మరణాలను నివారించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మహిళలు గర్భం దాల్చింది మొదలు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఆకుకూరలు, తాజా పండ్లు, కూరగాయలు, కోడిగుడ్లు, పాలు రోజూ ఆహారంలో ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ రాజయ్య, సూపర్‌వైజర్ హైమావతి, ఎంఎల్‌హెచ్‌పీ రమ్య, సుప్రియ, మునెమ్మ, స్పందన, పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోనే ఉన్నాం



మాట్లాడుతున్న నాయకులు

పొదలకూరు: తాము తెలుగుదేశం పార్టీలో చేరలేదని, వైఎస్సార్‌సీపీలోనే ఉన్నామని నావూరుపల్లికి చెందిన పలువురు తెలిపారు. బుధవారం ఈ ఊర్లో రచ్చబండ కార్యక్రమానికి మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వెళ్లారు. ఈ క్రమంలో మాట్లాడుదామని పిలిచి సోమిరెడ్డి టీడీపీ కండువాలు కప్పారని మంగలి రంగయ్య, పిల్లపాక పొండయ్య వాపోయారు. తమను మోసం చేశారని, వైఎస్సార్‌సీపీలోనే ఉన్నట్లు వారు తెలిపారు.

క్రీడా పోటీల్లో విభిన్న ప్రతిభావంతుల ప్రతిభ



ప్రతిభ చూపిన విభిన్న ప్రతిభావంతులు

తోటపల్లిగూడూరు: జిల్లా స్థాయి క్రీడల్లో తోటపల్లిగూడూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విభిన్న ప్రతిభావంతులు ప్రతిభ చూపారు. ఈనెల 8వ తేదీన సమగ్ర శిక్ష సహిత విభాగం ఆధ్వర్యంలో నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో విభిన్న ప్రతిభావంతులకు జిల్లా స్థాయి క్రీడా పోటీలు జరిగాయి. తోటపల్లిగూడూరు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ప్రదీప్ (9వ తరగతి) లాంగ్‌జంప్‌లో ప్రథమ స్థానం, 100 మీటర్ల పరుగుపందెంలో ద్వితీయ స్థానం, షాట్‌పుట్‌లో ద్వితీయ స్థానం సాధించాడు. లోకేష్ (9వ తరగతి) 100 మీటర్ల పరుగుపందెంలో ప్రథమ స్థానం, లాంగ్‌జంప్‌లో ద్వితీయ స్థానం, షాట్‌పుట్‌లో ద్వితీయ స్థానంలో నిలిచాడు. మాధురి (10వ తరగతి) 100 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానంలో నిలిచింది. అలాగే మోహన్ శివరాం (6వ తరగతి) 100 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానం, ఇంకా జ్ఞానేశ్వరి (6వ తరగతి), పలువురు వివిధ పోటీల్లో గెలుపొందారు. బుధవారం పాఠశాలలో జరిగిన ఓ ప్రత్యేక కార్యక్రమంలో వారిని ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. రామచంద్రయ్య, ఐఈఆర్పీలు షెహనాజ్, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

సీఫుడ్ ఫెస్టివల్ ఏర్పాట్ల పరిశీలన

నెల్లూరు సిటీ: రాష్ట్ర మత్స్యశాఖ, భూమి ఆర్గానిక్స్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని కస్తూరి దేవి గార్డెన్స్‌లో ఈ నెల 11 నుంచి మూడ్రోజుల పాటు నిర్వహిస్తున్న సీఫుడ్ ఫెస్టివల్ ఏర్పాట్లను కార్పొరేషన్ కమిషనర్ వికాస్‌మర్మత్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సీఫుడ్ ఫెస్టివల్‌కు కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. తాగునీరు, మొబైల్ టాయిలెట్స్, తదితర సౌకర్యాలు కల్పిస్తున్నామని చెప్పారు. సీఫుడ్ ఫెస్టివల్ ప్రచారం కోసం ఫ్లెక్సీలు, హోర్డింగుల ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేశామని తెలిపారు.

ఫిర్యాదులు పునరావృతం కాకుండా చర్యలు

నగర పాలక సంస్థ కార్యాలయంలో ప్రతి సోమవారం జరిగే స్పందన కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులు తిరిగి పునరావృతం కాకుండా క్షేత్రస్థాయిలో అధికారులు పర్యవేక్షించాలని కమిషనర్ వికాస్‌మర్మత్ ఆదేశించారు. నగరంలోని పొదలకూరురోడ్డు, వీఆర్సీ కళాశాల తదితర ప్రాంతాల్లో కమిషనర్ పర్యటించారు. స్పందన సమస్యలను పరిశీలించారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలు వెంటనే పరిష్కరించాలని సూచించారు. కాగా విజయవాడ నుంచి రాష్ట్ర కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ పి.కోటేశ్వరరావు బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కమిషనర్ వికాస్ మర్మత్ పాల్గొన్నారు. జగనన్నకు చెబుదాం, ఆస్తి పన్ను, తాగునీటి సరఫరా, అక్రమ కట్టడాలు, జగనన్న శాశ్వత భూ హక్కు పథకం, రీ సర్వే, క్లాప్ కార్యక్రమం, సీజనల్ వ్యాధులు, కోర్టు కేసుల వంటి అంశాలపై చర్చించారు. సమావేశంలో కార్పొరేషన్ అదనపు కమిషనర్ శర్మద, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఎస్‌ఈ సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వెంకటాచలం: మోటార్‌బైక్ బోల్తా అదుపు తప్పి ఓ వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని కసుమూరులో బుధవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు నగరం కోటమిట్టకు చెందిన షేక్ ఫయాజ్ పని నిమిత్తం బైక్‌పై కసుమూరుకు వెళ్లాడు. తిరిగి నెల్లూరుకు వస్తుండగా కసుమూరు మలుపు రోడ్డు వద్ద ఆటో అడ్డురావడంతో బైక్ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఫయాజ్‌కు గాయాలవడంతో చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు దాటుతుండగా..

బుచ్చిరెడ్డిపాళెం: రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైన ఘటన బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలోని రాజ్‌కిశోర్ సినిమా హాల్ వద్ద బుధవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. సుబ్బారావు అనే వ్యక్తి సినిమాహాల్ వద్ద ముంబై జాతీయ రహదారి దాటుతుండగా మోటార్‌బైక్‌పై వస్తున్న గుర్తుతెలియని వ్యక్తి ఢీకొట్టాడు. దీంతో సుబ్బారావు కాలికి గాయమైంది. అతడిని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనపై పోలీస్‌లకు ఫిర్యాదు అందలేదు.

వక్ఫ్ బోర్డు ఉపాధ్యక్షుడి నియామకం



ఎమ్మెల్యే ప్రసన్నకు పూలమొక్క అందజేస్తున్న షాజహాన్

కోవూరు: వక్ఫ్ బోర్డు జిల్లా ఉపాధ్యక్షుడిగా కోవూరు మండలంలోని పడుగుపాడుకు చెందిన విశ్రాంత నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్ మేనేజర్ ఎస్‌కే షాజహాన్‌ను రాష్ట్ర వక్ఫ్ బోర్డు ఉన్నతాధికారులు నియమించారు. ఇందుకు సహకారం అందించిన కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని బుధవారం షాజహాన్ కోవూరులో కలిసి పూలమొక్కను అందించారు. షాజహాన్ గతంలో వక్ఫ్ బోర్డు సభ్యుడిగా ఉన్నారు. కార్యక్రమంలో డీఏఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, పడుగుపాడు ఉప సర్పంచ్ ఎస్‌కే అహ్మద్, వార్డు సభ్యుడు రఫీ, హయద్, దావుద్, మౌలాలీ తదితరులు పాల్గొన్నారు.

విధుల నుంచి తప్పించాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

పొదలకూరు: అంగన్‌వాడీ టీచర్లను బూత్ లెవల్ ఆఫీసర్ విధుల నుంచి తప్పించాలని బుధవారం తహసీల్దార్ కె.వీరవసంతరావుకు స్థానిక కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ అసోసియేషన్ వారు మాట్లాడుతూ ఎన్నికల సంఘం తమకు విధులు కేటాయించొద్దని ఉత్తర్వులిచ్చిన నేపథ్యంలో బీఎల్వో నుంచి తప్పించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు పి.స్వర్ణలత, ఎస్‌కే రహీనాబేగం, కాశేశ్వరి, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకం అందరి బాధ్యత



ముత్తుకూరులో ర్యాలీ



ముత్తుకూరు: ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

- వీఎస్‌యూ వీసీ జీఎం సుందరవల్లి



వెంకటాచలం: మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్న వీఎస్‌యూ వీసీ

వెంకటాచలం: 'మొక్కల పెంపకం అందరి బాధ్యత. నాటడమే కాకుండా సంరక్షించాలి.' అని వీఎస్‌యూ వీసీ జీఎం సుందరవల్లి పిలుపునిచ్చారు. మండలంలోని కాకుటూరు వద్దనున్న వీఎస్‌యూలో బుధవారం ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో నా భూమి – నా దేశం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని వర్సిటీలో వీసీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మొక్కలు నాటడం ద్వారా భావితరానికి మంచి ప్రపంచాన్ని ఇవ్వగలుగుతామని చెప్పారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఆర్మీ పర్సన్ ఎస్‌ఎం రావును శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.రామచంద్రారెడ్డి, ప్రిన్సిపల్ విజయానంద్‌కుమార్ బాబు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ఉదయ్‌శంకర్, డాక్టర్ సునీత, డాక్టర్ విద్యాప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో 'నా భూమి – నా దేశం'



బుచ్చిరెడ్డిపాళెం: మొక్కలు నాటుతున్న దృశ్యం

ముత్తుకూరు: ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ముత్తుకూరు సచివాలయంలో బుధవారం నా భూమి – నా దేశం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా అధికారులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. మొక్కలు నాటారు. దేశభక్తితో స్వాతంత్ర సమరయోధులను గౌరవించుకోవాలంటూ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా స్వాతంత్రోద్యమ ఘట్టాలను, బ్రిటిష్ పాలకుల వైఖరిని ఎంఈఓ మధుసూదన విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ గండవరం సుగుణ, జెడ్పీటీసీ సభ్యుడు బండెల రమణయ్య, సర్పంచ్ బూదూరు లక్ష్మి, ఉపసర్పంచ్ అనితారెడ్డి, ఎంపీడీఓ ప్రత్యూష, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

- **బుచ్చిరెడ్డిపాళెం:** ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని మండలంలోని దామరమడుగులోని శ్రీకొండా కోటారెడ్డి ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ ఎ.శ్రీనివాసులు అన్నారు. నా భూమి – నా దేశం కార్యక్రమంలో భాగంగా ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో బుధవారం కాలేజీలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్ తరాల కోసం మొక్కలు నాటాలని కోరారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారిణి లక్ష్మీరాజ్యం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



తోటపల్లిగూడూరులో..

- **తోటపల్లిగూడూరు:** నా భూమి – నా దేశం మండలంలో బుధవారం ఘనంగా ప్రారంభమైంది. స్థానిక మండల కార్యాలయంలో జరిగిన ఓ ప్రత్యేక కార్యక్రమంలో ఎంపీపీ ఉప్పల స్వర్ణలత పాల్గొని మాట్లాడుతూ గ్రామాల్లో శిలాఫలకాలను ఆవిష్కరించడం, జాతీయ జెండాను ఎగురవేయడం, మట్టి నమూనాల సేకరణ, ప్రతిజ్ఞ చేయడం, స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకోవడం వంటి కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ హేమలత, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శంకరయ్య గౌడ్, ఎంపీటీసీ సభ్యులు రాయపు శీనయ్య, కాయల మణి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి వెంకటశేషయ్య



రైస్ కార్డు అందజేస్తున్న దృశ్యం

వెంకటాచలం: పేద ప్రజల సమస్యలను పరిష్కరించడమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మందల వెంకటశేషయ్య అన్నారు. నూతనంగా మంజూరైన రైస్ కార్డులను వెంకటాచలంలోని గ్రామ సచివాలయంలో బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు పాలనలో రేషన్‌కార్డులు, పింఛన్లు మంజూరు కావాలంటే సంవత్సరాల తరబడి ఎదురుచూపులు చూడాల్సి వచ్చేదని గుర్తు చేశారు. జగనన్న పాలనలో గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే అర్హతే ప్రామాణికంగా రేషన్‌కార్డులు, పింఛన్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఇటీవల జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో రైస్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి మంజూరైనట్లు వెల్లడించారు.

దోమల నివారణకు చర్యలు

- వైద్యాధికారి రామకృష్ణ



చేపలు వదులుతున్న వైద్యాధికారులు

కొడవలూరు: దోమల నివారణకు చర్యలు తీసుకున్నామని, ఇందులో భాగంగా గంబూసియా చేపలను గుంతల్లో వదులుతున్నట్లు వైద్యాధికారి ఎం.రామకృష్ణ తెలిపారు. కొడవలూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో కొడవలూరు, గుండాలమ్మపాళెం, పద్మనాభసత్రంలోని మురుగునీరు నిల్వ ఉన్న గుంతలు, కాలువల్లో బుధవారం గంబూసియా చేపలను వదిలారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ఆ చేపలు దోమల లార్వాను తినేస్తాయన్నారు. దీంతో దోమల ఉత్పత్తి తగ్గుతుందన్నారు. తద్వారా మలేరియా, చికెన్ గున్యా, డెంగీ లాంటి వ్యాధులు సోకకుండా నివారించవచ్చని చెప్పారు. ప్రభుత్వం దోమల నివారణకు గంబూసియా చేపలను పంపిణీ చేస్తోందన్నారు. ఒక్కో గుంతలో 1,500 నుంచి 2,000 చేపలను వదిలినట్లు వివరించారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి నాగరాజు, వైద్యాధికారిణి గీతా సాహితి, సీహెచ్‌ఓ సోమశేఖర్, హెచ్‌ఎస్ రామ్మోహన్, హెచ్‌ఏ షఫీ ఉద్దీన్, స్టాఫ్ నర్సులు వెన్నెల, పద్మ, ల్యాబ్ టెక్నీషియన్ గ్రేస్ మేరీ తదితరులు పాల్గొన్నారు.

సోమిరెడ్డిని విచారిస్తే గ్రావెల్ మాఫియా బట్టబయలు

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి వెంకటశేషయ్య



మాట్లాడుతున్న మందల వెంకటశేషయ్య

నెల్లూరు(దర్గామిట్ట): సర్వేపల్లి నియోజకవర్గంలోని కనుపూరు చెరువుకు సంబంధించిన గ్రావెల్ మాఫియాపై మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని పోలీసులు విచారిస్తే అన్ని విషయాలు బట్టబయలవుతాయని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మందల వెంకటశేషయ్య అన్నారు. నెల్లూరు మాగుంటలేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రావెల్ దొంగను దాచి సోమిరెడ్డి ఇష్టానుసారం మాట్లాడుతున్నారన్నారు. అక్రమంగా గ్రావెల్‌ను తరలిస్తున్న బుచ్చినాయుడు వెనుక చంద్రమోహన్‌రెడ్డి ఉన్నారని రుజువైందన్నారు. కనుపూరు చెరువు నుంచి రైతులకు మట్టి తోలుతున్నామని అనుమతులు తీసుకుని నెల్లూరుకు బుజ్జినాయుడు గ్రావెల్ తరలిస్తున్నాడని ఆరోపించారు. గుడూరు వారిపాళెం ఘటనపై స్టేషన్‌లో పడుకున్న సోమిరెడ్డి వెంటనే బుజ్జినాయుడి వ్యవహారంపై స్పందించాలన్నారు. ఆయన తన ఇంట్లోనే గ్రావెల్ మాఫియా దొంగకు ఆశ్రయమిచ్చారని ఆరోపించారు. విచారిస్తే ఈ మాఫియా వెనక ఎవరు ఉన్నారో పోలీసులకు పూర్తి వివరాలు తెలుస్తాయన్నారు. టిప్పర్ ప్రమాదంలో బ్యాంకు ఉద్యోగి చనిపోతే తొలుత తమకు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో సోమిరెడ్డి పోస్టులు పెట్టించారని తెలిపారు. ప్రమాదానికి కారణమైన వాహనం టీడీపీ నేత బుజ్జినాయుడిదని తెలిసి వెంటనే ఆ పోస్టులను డిలీట్ చేశారన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో టీడీపీ రాదని ఆ పార్టీ నాయకులే చెబుతున్నారన్నారు. తమ నాయకుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి వెంట నడిస్తే రాజకీయ భవిష్యత్ ఉంటుందని టీడీపీ నాయకులు కూడా వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకుంటున్నారని తెలిపారు. ఆ చేరికలను చూసి ఓర్వలేక సోమిరెడ్డి ఇష్టమొచ్చినట్లుగా మాట్లాడుతున్నారన్నారు. సమావేశంలో వైఎస్సార్సీపీ జిల్లా గ్రీవెన్‌సెల్ అధ్యక్షుడు తలమంచి సురేంద్రబాబు, టీపీగూడూరు మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.